క్లుప్తంగా

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 30వ తేది శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు లక్ష దీపోత్సవం

రేపల్లె రూరల్: పట్టణంలోని గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 29వ తేది శుక్రవారం సాయంత్రం లక్ష దీపోత్సవం, కర్పూర యజ్ఞం మహోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నూతన పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన



భటట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నూతన పైప్‌లైన్ నిర్మాణానికి గురువారం గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్థానిక 10వ వార్డులో పంచాయతీ సభ్యురాలు గోలి సుధతో కలసి సర్పంచ్ రవి కిరణ్మయి శంకుస్థాపన చేశారు. ఈ నూతన పైప్‌లైన్ ఏర్పాటుతో తాగునీరు అందించడం సులభతరమైందని సర్పంచ్ తెలిపారు. హైస్కూల్ నుంచి స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వరకు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, నాయకులు దారా చెన్నయ్య, గోలి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

రేపల్లె ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ దివాకర్



వెల్లటూరు(భట్టిప్రోలు): మద్యం దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రేపల్లె ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ దివాకర్ పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరులో మద్యం దుకాణాలు స్థల మార్పిడి నేపథ్యంలో పరిశీలించేందుకు గురువారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా దుకాణాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. సీఐ దివాకర్ మాట్లాడుతూ మద్యం దుకాణదారులు నిబంధనలకు అతీతంగా వ్యవహరిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహణ చట్ట విరుద్ధమని దీనిపై ప్రత్యేక చొరవ తీసుకుని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే మద్యం దుకాణాలు తెరవడానికి ముందే సమీపంలోని పరిసరాలను శుభ్రం చేయాలని సూచించారు. అలాగే వారానికి ఒకసారి బ్లీచింగ్, సున్నం చల్లించాలని కోరారు. ఆయన వెంట ఎస్ఐ రాజశ్రీ, సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత



కొత్తపాలెం(కర్లపాలెం): అగ్ని ప్రమాదాలు సంభవించకుండా అప్రమత్తంగా ఉండాలని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చెప్పారు. పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలెం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో గృహం దగ్ధమైన శివకోటిరెడ్డిని గురువారం ఎమ్మెల్యే నరేంద్రవర్మ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అబ్దుల్, మాజీ సర్పంచ్ దోమా నాగేశ్వరరెడ్డి, ఏడుకొండలరెడ్డి, పంచాయతీ కార్యదర్శి తుమ్మా వెంకటేశ్వరరెడ్డి, వీఆర్వో జ్యోతి తదితరులు ఉన్నారు.

రేపు భారత రాజ్యాంగం మంచీచెడుపై చర్చాగోష్టి

తెనాలి: భారత రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా ఈనెల 30న తెనాలిలో 'భారత రాజ్యాంగం: మంచి-చెడు' అంశంపై చర్చాగోష్టి జరగనుంది. పట్టణ సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు ఏర్పాటయే సభకు మానవ హక్కుల వేదిక జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రాజనీతిశాస్త్ర ఆచార్య వి.అంజిరెడ్డి, విప్లవ రచయితల సంఘం నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్ చర్చను ప్రారంభిస్తారని గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

విద్యార్థినులపై చిన్నచూపు తగదు

- బాలికల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం
- విద్యకు దూరమవుతున్న బాలికలు
- అమలు కాని నాప్‌కిన్ల పథకం

శానిటరీ నాప్‌కిన్ యంత్రాలు.. బహుదూరం

భట్టిప్రోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వంలో ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా అటకెక్కిస్తోంది. అలాంటి పథకాల్లో శానిటరీ నాప్‌కిన్ యంత్రం ఒకటి. విద్యార్థినులకు వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యం, వ్యక్తిగత సమస్యలపై అవగాహన కల్పించేలా శానిటరీ నాప్‌కిన్ పంపిణీ పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శానిటరి నాప్‌కిన్ యంత్రాలను ప్రవేశపెట్టింది. ఇవి అన్ని హైస్కూళ్లలోను ఏర్పాటు చేశారు. 7 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. అలాగే దీంతో పాటు వాడిన నాపికిన్‌లను బర్నింగ్ చేసే మిషన్లను కూడా హైస్కూళ్లలో అందుబాటులో ఉంచారు. ఈ మిషన్‌లో 40 ప్యాకెట్లు ఉంటాయి. 10 రూపాయిల కాయిన్ లేదా రెండు ఐదు రూపాయిల కాయిన్లు వేస్తే శానిటరీ నాప్‌కిన్ ప్యాడ్ల ప్యాకెట్ వస్తుంది. ప్రస్తుతం ఇవి ఏ పాఠశాలల్లో పని చేస్తున్న దాఖలాలు కనిపించటం లేదు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు తమ పిల్లలను నెలలో కొద్ది రోజులు పాఠశాలలకు దూరం చేస్తున్నారు. ఫలితంగా వారి చదువుకు ఆటంకం కలుగుతుంది.



భట్టిప్రోలు హైస్కూల్‌లో పని చేయని శానిటరి నాప్‌కిన్ యంత్రం

■ వేమూరు నియోజకవర్గంలో అమృతలూరు, చుండూరు, కొల్లూరు, వేమూరు, భట్టిప్రోలు మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో 7వ తరగతి నుంచి 10 వరకు చదివే విద్యార్థినులు సుమారు 5 వేలకు మందికి పైగా ఉన్నారు. వీరికి ప్రతి ఏడాది సరిపడా శానిటరీ నాప్‌కిన్లు ఇవ్వాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం బాలికలకు అవసరమైన శానిటరీ నాప్‌కిన్లు ఇవ్వాలన్న ఆలోచన చేయకపోవటం ఆశ్చర్యంగా ఉంది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం యంత్రాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాప్‌కిన్లు ఇస్తే వెసులుబాటుగా ఉంటుంది



విద్యార్థినులకు ప్రభుత్వం ఉచితంగా నాప్‌కిన్లు అందిస్తే వారికి కొంత వెసులుబాటుగా ఉంటుంది. ఎక్కువగా కో ఎడ్యుకేషన్ కావడంతో బాలికలు కూడా ఇబ్బందులు పడకుండా ఉండే వీలు ఉంటుంది. వ్యక్తిగత శుభ్రతపై వారికి అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాం.

– గుర్రం మురళీమోహన్, ఉపాధ్యాయులు, వెల్లటూరు(భట్టిప్రోలు)

పూలేను యువత ఆదర్శంగా తీసుకోవాలి

వేమూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు

ఓలేరు(భట్టిప్రోలు): స్త్రీలకు విద్య అవసరమని గుర్తించి అందుకోసం కుటుంబంతో సహా కృషి చేసిన నవయుగ వైతాళికుడు పూలేను నేటి యువత ఆదర్శంగా తీసుకుని నడవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. జోతిరావ్‌పూలే వర్ధంతి పురస్కరించుకుని గురువారం భట్టిప్రోలు మండలం ఓలేరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానమేనని చాటి చెప్పిన ఘనత పూలేకు దక్కుతుందని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతికి అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయుడని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాటాలు చేసిన సామాజిక ఉద్యమకారుడని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), గ్రామ సర్పంచ్ మేరుగ రంగారావు, నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, పడమట శ్రీనివాసరావు, జంగం వాసు, జల్లి జోషికాంత్ తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వేమూరు సమన్వయకర్త అశోక్‌బాబు, ఎంపీపీ లలిత

మహిళోద్ధారకుడు మహాత్మ జ్యోతిరావ్‌పూలే

భట్టిప్రోలు: మహిళా అక్షరాస్యతకు ప్రాధాన్యతను ఇచ్చిన ఘనత మహాత్మ జ్యోతిరావ్‌పూలేకు దక్కుతుందని ఎంపీడీవో ఎస్.వెంకటరమణ పేర్కొన్నారు. జ్యోతిరావ్‌పూలే వర్ధంతి పురస్కరించుకుని భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ పూలే ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. మహిళోద్ధారకుడిగా, అంటరానితనం, అస్పృశ్యతలపై అనేక ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు. అనేక రకాల పీడిత ప్రజా వికాస మేధో వాదనలకు దారులు వేసిన నిజమైన తాత్విక వేత్త మహాత్మ జ్యోతిరావ్ పూలే అని అన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ జలజ, స్త్రీ నిధి జిల్లా ఏజీఎం నాగబాబు, మేనేజర్ పి.అశోక్, సీసీలు బి.హనోకు, రజనీ కుమారి, నరేంద్ర, అకౌంటెంట్ శిరీష, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో వెంకటరమణ, సిబ్బంది

మహిళా విద్యాభివృద్ధికి పూలే సేవలు ఎనలేనివి

రేపల్లె వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

రేపల్లె రూరల్: మహిళా విద్యాభివృద్ధిలో పూలే దంపతుల సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడు పూలే అన్నారు. అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారన్నారు. స్వయంగా తన భార్య సావిత్రీబాయికి విద్యను నేర్పించి మహిళా విద్యాభివృద్ధి కోసం పూలే దంపతులు నిరంతరం శ్రమించారన్నారు. అంటరానితనం నిర్మూలనకై పూలే రచించిన గులాంగిరి రచన ఆణిముత్యమన్నారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్

అలరిస్తున్న క్రిస్మస్ స్టార్‌లు



రేపల్లె ఐఆర్‌ఈఎఫ్ చర్చి వద్ద క్రిస్మస్ స్టార్

క్రీస్తు జననానికి సూచికగా పట్టణంలోని పలు చర్చిల ఆవరణలో క్రిస్మస్ స్టార్‌లను విశ్వాసులు ఏర్పాటు చేస్తున్నారు. క్రిస్మస్ నెలను పురస్కరించుకుని పట్టణంలో పలు చర్చిల ఆవరణలతో పాటు విశ్వాసులు తమ ముంగిళ్లలో స్టార్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్టార్‌లు కాంతులు వెదజల్లుతూ.. మిరిమట్లు గొల్పుతూ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. – రేపల్లెరూరల్



రేపల్లె ఏఈఎల్ చర్చి ఆవరణలో క్రిస్మస్ స్టార్

పూలే ఆశయాలను ముందుకు తీసుకుపోదాం

పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు

బాపట్ల: జ్యోతిరావుపూలే ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు పేర్కొన్నారు. జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక చీలురోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాగిత సుధీర్‌బాబు జ్యోతిరావుపూలే చేపట్టిన ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 50 సంవత్సరాలు నిండిన బీసీలకు పింఛన్లు ఇస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, నాయకులు గవిని కృష్ణమూర్తి, నర్రా ఏడుకొండలు, పీటావేణు, శాయిల మురళి, మోర్ల సముద్రాలగౌడ్, నర్రావుల వెంకట్రావు, జోగి రాజా, ఆట్ల నాగేశ్వరరెడ్డి, షేక్ సుభానీ తదితరులు ఉన్నారు.

బీసీల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి

బీసీల అభ్యున్నతితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జ్యోతిరావు పూలే ప్రకటించిన విషయాన్ని నేటి అధికారులు, పాలకులు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొన్నారు. గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని చీలు రోడ్‌లోని ఆయన విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ అమలుపై అధికారులు, పాలకులు చిత్తశుద్ధి చూపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మారం రవికుమార్, సీనియర్ నేత మోహన్ గౌడ్, యువజన ప్రధాన కార్యదర్శి కంకణాల రాంబాబు, కృష్ణ చైతన్య బీసీ వసతి గృహం వార్డెన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెనుకబడిన కులాల అభ్యున్నతికి కృషి

జ్యోతిరావు పూలే వెనుకబడిన కులాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని టీడీపీ నాయకులు పఠాన్ రాజేష్ పేర్కొన్నారు. జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నక్క ప్రకాష్, జి.దుర్గ ప్రసాద్, కె.కొండలు, మణిక్యారావు, నిలంబరం, జ్యోతి ప్రసాద్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

బాపట్లటౌన్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన పట్టణ శివారులోని మూర్తిరక్షణ నగర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని నరసాయపాలెం గ్రామానికి చెందిన దారా సుజన్‌రావు(54) పట్టణంలోని మూర్తిరక్షణనగర్‌లోని అత్తగారి ఇంటికి వెళ్లి బావమరిది దండమూడి ఏసుపాదంతో కలిసి ద్విచక్ర వాహనంపై పొలానికి బయల్దేరారు. మూర్తిరక్షణ నగర్ నుంచి మెయిన్‌రోడ్డుపైకి వస్తుండగా అదే సమయంలో గుంటూరు నుంచి చీరాల వైపు వస్తున్న ఏపీ39యుడీ 4269 నెంబర్ గల హెచ్‌పీ పెట్రోల్ ట్యాంకర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న సుజన్‌రావు అక్కడికక్కడే మృతి చెందగా, ఏసుపాదంకు తీవ్ర గాయాలు కావడంతో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. పట్టణ సీఐ ఆర్. అహ్మద్‌జానీ ఘటనా స్థలానికి చేరుకొని సుజన్‌రావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య దీవెనమ్మ, ఒక కుమార్తె ఉన్నారు.



పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు విజయవంతం చేయాలి

ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు



కర్లపాలెం: పాఠశాలల్లో డిసెంబర్ 7వ తేదీన జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలను విజయవంతం చేసే విధంగా కృషి చేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో డిసెంబర్ 7వ తేదీన జరిగే తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సంయుక్త సమావేశానికి రావలసిందిగా తల్లిదండ్రులందరినీ ఆహ్వానించే విధంగా ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేయాలని ఎంపీడీవో ఎంఈవోలకు చెప్పారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవోలు మనోరంజని, విజయశ్రీ ఉన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం దుండివారిపాలెం గ్రామంలోని గ్రామ సచివాలయం, ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, సర్వే వేగవంతం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రమైన పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరిగే విధంగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు చెప్పారు. అనంతరం అక్కిరాజుదిబ్బ కాలనీలో నివాసం ఉంటున్న గిరిజనులు సంచార జాతుల వారికి ఆధార్, రేషన్, ఉపాధి హామీ జాబ్‌కార్డులు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని వెంటనే మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరాస్వామిరెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

టెన్నిస్ క్రీడాకారుడు మహేష్‌కు అభినందన

తెనాలిరూరల్: ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుండి 25 వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన టెన్నిస్ టోర్నమెంట్‌లో విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తితో కలసి పాల్గొన్న తెనాలి టైన్‌మ్యాన్ కొమరాగిరి మహేష్ జాతీయ స్థాయిలో రన్నర్స్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మహేష్‌ను పలువురు అభినందించి సత్కరించారు. టెన్నిస్ క్రీడాకారుడైన త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు ఆఫీషియల్స్ క్లబ్‌లో గురువారం క్లబ్ సభ్యులతో కలసి శాలువా పూలమాలలతో మహేను సత్కరించి అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో విజయాలు పొందాలని ఆకాంక్షించారు.

డిసెంబర్ 2 వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలి

రేపల్లె రూరల్: రైతులు డిసెంబర్ 2వ తేదీ వరకు వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్.విజయ్‌బాబు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారిందని, కోస్తా ప్రాంతాలపైనా దీని ప్రభావం ఉండవచ్చని వాతావరణ శాఖ సూచనల మేరకు వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు పంట పొలాల్లో నిలిచే అదనపు నీటిని బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలకు తరలించాలని చెప్పారు. యంత్రాల ద్వారా నూర్పిడి చేసిన ధాన్యం రైతుల వద్ద ఉంటే రైతు సేవా కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు అమ్ముకోవాలని తెలిపారు. కోతలు కోసి ఉంటే కుప్పలు వేసుకోవాలని సూచించారు.

రేపే పెన్షన్‌లు పంపిణీ

రేపల్లె రూరల్: సామాజిక భద్రత పెన్షన్‌లను ఈ నెల 30న పింఛన్‌దారులకు అందజేయటం జరుగుతుందని ఎంపీడీవో ఎం.శోభారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ ఆదివారం కావటంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు 30వ తేదీ శనివారం పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. నవంబర్ నెలలో తీసుకోని పింఛన్‌దారులు రెండు నెలలకు సంబంధించిన పింఛన్ నగదును పొందవచ్చన్నారు.

వెల్లటూరులో అయ్యప్ప పడి పూజ

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ దేవత కట్లమ్మ తల్లి దేవస్థానంలో గురువారం అయ్యప్పస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో 41 రోజుల మండల దీక్ష తీసుకున్న స్వాములు పడి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు సద్ది ఏర్పాటు చేశారు. శేకూరు గురుస్వామి గుంటుపల్లి శ్రీనివాసరావు స్వాములకు ఇరుముడుల ధారణ చేశారు. 14 మంది దీక్షధారులు ఇరుముడి కట్టించుకుని అయ్యప్ప సన్నిధికి పయనమయ్యారు. యార్లగడ్డ శరత్‌బాబు, శిరీష, లావణ్య, సాత్విక్‌లు స్వాములకు ఏర్పాటు చేసిన సద్దికి సహాయ సహకారాలు అందించారు.

వంట పాత్రలు అందజేత



సంగుపాలెం(కర్లపాలెం): అగ్ని ప్రమాద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కర్లపాలెం చైర్మన్ ఇనకొల్లు పోలీస్‌రావు అన్నారు. పిట్టలవానిపాలెం మండలంలోని సంగుపాలెం గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తూ గృహం దగ్ధమైన బాధితులు గెడ్డం పోలయ్య, రమణ దంపతులకు రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున పోలీస్‌రావు వంట పాత్రలు తాత్కాలిక నివాసం కొరకు టార్పాలిన్ పట్టాలను అందజేశారు. పూరి గృహాల్లో నివసించే వారు అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు.